
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

ఆదివారం 26 జనవరి 2025

జిల్లాల వార్తలు

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు
సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఘటన..
42మందిపై కేసు నమోదు
చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం 7

మండలంలో ఒక గ్రామానికే...

ఎంపిక చేసిన ఊరిలోనే నేడు ప్రారంభం

దశలవారీగా మిగిలిన గ్రామాల్లో..

సంక్షేమ పథకాల అమలులో మెలిక

మెదక్ జిల్లాలో 21 మండలాలు

ప్రజాప్రతినిధుల సూచనలతోనే 'తొలి' గ్రామాల ఎంపిక

నేటి మధ్యాహ్నం సీఎం సందేశంతో శ్రీకారం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఏపీవో, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపీడీవో, ఆహారభద్రత కార్డులకు తహసీల్దార్, రైతుభరోసాకు ఎంఏవోల నేతృత్వం

మెదక్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు నేడు శ్రీకారం చుట్టనున్నారు. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి పథకాలను అమలు చేస్తారని భావించారు. అయితే, మండలంలో ఒక గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపికచేసి, అనంతరం అన్ని గ్రామాలు, పట్టణాలకు వర్తింపజేయనున్నట్లు తెలుస్తోంది. మెదక్ జిల్లాలో ఆదివారం 21 మండలాల పరిధిలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేయనున్నారు. అధికారులు ముందుగా ప్రజా ప్రతినిధులను సంప్రదించి, వారి సూచనల మేరకు గ్రామంలో సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలందాయి. షామియానాలు, వేదిక, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్య అతిథులుగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.



మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం

ఎంపిక చేసిన గ్రామాలలో మధ్యాహ్నం ఒంటిగంటకు సీఎం సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించనున్నారు. నాలుగు పథకాల అమలుకు గానూ ఒక్కో పథకానికి ఒక్కో బృందం చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ఆహార భద్రతా కార్డులకు తహసీల్దార్ నేతృత్వంలో.. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో, రైతు భరోసా పథకానికి మండల వ్యవసాయాధికారి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఏంపీడీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తూ నాలుగు సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతమయ్యేలా పర్యవేక్షిస్తారు.

జాబితా ముందే పరిశీలించుకోండి : కలెక్టర్

సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వెళ్లడానికి ముందే ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాలో అర్హులు మాత్రమే ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రజాపాలన, గ్రామ సభల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా పథకాల అర్హుల జాబితాలో చేర్చాలని ఆదేశించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే అర్హులకు ప్రొసీడింగ్స్ అందజేయాలని సూచించారు. అర్హులకు పథకాలను అందిస్తూనే అనర్హులకు అందకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి అంటే తూర్పు.. జయము.. ప్రకాశము..

- జగ్గారెడ్డి (జయప్రకాశ్‌రెడ్డి)ని అభివర్ణించిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ
- సంగారెడ్డిని చూస్తే లైట్ల వెలుగులో ప్రసరిస్తున్న పట్టణాన్ని చూసినట్లుగా ఉంటుంది
- జేబులో పైసలుంటే ఇస్తూనే ఉంటారు.. లేకుంటే అప్పు సప్పు చేసైనా సాయం చేస్తుంటారు.. ఇదే జగ్గారెడ్డి దాన గుణం





మాట్లాడుతున్న శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ, జగ్గారెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న మాధవానంద సరస్వతి స్వామిజీ

సంగారెడ్డి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'సంగారెడ్డి అంటే తూర్పు.. జయము.. ప్రకాశము.. అందుకే ఈ పట్టణం ఎప్పటికీ లైట్ల వెలుగులో ప్రసరిస్తున్నట్లుగా ఉంటుంది' అని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ వ్యాఖ్యానించారు. తూర్పు అనే ఇంటి పేరుతో నిరంతరం ప్రకాశిస్తుంటారని ఆయన జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. దాన గుణం, ధర్మ గుణం లక్షణాలను జగ్గారెడ్డి పుణికిపుచ్చుకున్నారని కొనియాడారు. ఆయన జేబులో డబ్బులున్నాయంటే ఇస్తూనే ఉంటారని.. లేకుంటే అప్పు సప్పు చేసైనా ఆపదలో ఉన్నవారికి సహాయ పడుతారని చెప్పుకొచ్చారు. ఆయన చేపట్టే ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా సంపూర్ణంగా ఉంటాయని కొనియాడారు. జగ్గారెడ్డిలో అంతర్లీనంగా పాండురంగడు ఉన్నాడని, ఆయన భజన గీతాలు ఆలపిస్తుంటే అర్థమవుతుందని తెలిపారు. జగ్గారెడ్డి భవగత్ సేవలోనే తరిస్తారని కితాబిచ్చారు.

సంగారెడ్డిలో రోడ్డు పనులు ప్రారంభించిన నిర్మలాజగ్గారెడ్డి

ప్రజల కోరిక మేరకు కొత్త రోడ్లు మంజూరు చేయించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని 22వ వార్డు పరిధిలో ఉన్న రాంనగర్‌లో సీసీరోడ్డు పనులను టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి శనివారం ప్రారంభించారు. స్థానిక ప్రజల కోరిక మేరకు రోడ్లు మంజూరు చేయించిన నిర్మలాజగ్గారెడ్డికి వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. అన్నీ వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, మున్సిపల్ ఏఈఈ రాహుల్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకులు శివుడు, మణి, రఘు, సూరి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని 22వ వార్డులో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

ఎరుపెక్కిన సంగారెడ్డి

కదంతొక్కిన కామ్రేడ్స్

తరలివచ్చిన కార్మిక, కర్షకులు

తెలంగాణలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఉచిత బస్సు తప్ప ఒక్క హామీ అమలు కావడం లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య



సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో సీపీఎం శ్రేణులు



అభివాదం చేస్తున్న బృందాకారత్

సంగారెడ్డి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఎరుపెక్కింది. ఎర్రజెండాలు పట్టుకొని తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, కార్మిక, కర్షకులు పట్టణ వీధుల్లో కదంతొక్కారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళా నాయకులు, కార్యకర్తలు కోలాటలు ఆడుతూ నృత్యాలు చేస్తూ ముందుకుసాగారు. ర్యాలీలో సీపీఎం నాయకులు డా.బీఆర్ అంబేడ్కర్, నరేంద్ర మోదీ, కార్మికుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు ర్యాలీకి భారీగా తరలిరావడంతో సంగారెడ్డి పట్టణం ఎరుపెక్కింది. పట్టణంలో నిర్వహించిన

మిగతా 7వ పజీలో.



హన్మంత్‌రావుపేట చేనేత సహకార సంఘంలో మూలనపడిన మగ్గాలు

మరుగున మగ్గం

హన్మంత్‌రావు పేటతో తెగిన 'పోగు'బంధం

- నాడు నేతన్నలతో గ్రామానికి గుర్తింపు
- నేడు ఆదరణ కరువై వలసబాట
- ఊళ్లో ఉన్న కొంతమంది ఇతర పనులకు..
- ఊళ్లో సగం కుటుంబాలు చేనేతలవే
- శిథిలావస్థకు చేరిన ఇళ్లు



7

ఓటు.. అందరి హక్కు
గ్రామగ్రామాన ఓటు హక్కు దినోత్సవ ర్యాలీలు 8

బల్దియాలో బాహాబాహీ
చివరి సమావేశం రసాభాస 8

ఇక.. ప్రత్యేక పాలన

ముగిసిన మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు

- ఉమ్మడి జిల్లాలో 15 పట్టణాలకు ప్రత్యేకాధికారులు
- సిద్దిపేట మున్సిపాలిటీకి మరో ఏడాదిన్నర గడువు
- ఈసారైనా జహీరాబాద్‌కు ఎన్నిక జరిగేనా?
- కొవిడ్‌తో నిధుల కొరత.. కుంటుపడిన అభివృద్ధి
- నోటిఫికేషన్ కోసం ఆశావహుల ఎదురుచూపు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 25: మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు నేటితో ముగుస్తోంది. ఇప్పటిదాకా చైర్మన్లు, చైర్‌పర్సన్లు, కౌన్సిలర్ల నిర్వహణలో కొనసాగిన పట్టణాల పాలన ఇకపై ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లబోతోంది. ఇప్పటికే గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల్లో అధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఉమ్మడి జిల్లాలో 21..

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తంగా 21 మున్సిపాలిటీలు ఉండగా ఇందులో 15 చోట్ల పాలకవర్గాల గడువు ముగిసింది. సిద్దిపేటలో ఏడాదిన్నర గడువు ఉండగా.. జహీరాబాద్‌లో కోర్టు కేసు కారణంగా పదేళ్ల నుంచి ఎన్నికలే జరగలేదు. ఇక ఇటీవలే కోహీర్, గుమ్మడిదల, ఇస్నాపూర్, గడ్డ పోతారం మున్సిపాలిటీలను కొత్తగా ఏర్పాటు చేశారు. గడువు పూర్తయిన మునిపాలిటీల తోపాటే కొత్తవాటికీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

గడువు పూర్తయిన మున్సిపాలిటీలు

సంగారెడ్డి జిల్లా
1, సంగారెడ్డి
2, అమీన్‌పూర్
3, తెల్లాపూర్
4, ఐడీఏ బొల్లారం
5, నారాయణఖేడ్
6, సదాశివపేట
7, అందోల్-జోగిపేట

సిద్దిపేట జిల్లా
1, గజ్వేల్-ప్రజ్ఞాపూర్
2, దుబ్బాక
3, హుస్నాబాద్
4, చేర్యాల

మెదక్ జిల్లా
1, మెదక్
2, నర్సాపూర్
3, రామాయంపేట
4, తూప్రాన్

అధికారులే అంతా..

రేపటి నుంచి మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులు రాబోతున్నారు. మున్సిపల్ కమిషనర్లు ఉన్నప్పటికీ ఇతర శాఖల ఉన్నతాధికారులను ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేయనున్న కొత్త పథకాల బాధ్యతనూ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంది. లబ్ధిదారుల ఎంపిక, అమలు వీరికి సవాల్‌గా మారనున్నది. ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో అధికారుల చేతుల్లో మున్సిపాలిటీలు ఎప్పటి దాకా ఉంటాయనే విషయంపై స్పష్టత లేదు. ఇప్పటికే ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న పంచాయతీ, స్థానిక సంస్థల తరువాతే బల్దియాలకు ఎన్నికల జరగనుండడంతో ఆలస్యమయ్యే పరిస్థితి

మిగతా 7వ పజీలో.

రామచంద్రాపురానికి ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్యను పెంచాలి

ఎంఎంటీఎస్ ఆపరేషనల్ హెడ్ పద్మజకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వినతి

రామచంద్రాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ సేవలను మరింత పెంచాలని ఎంఎంటీఎస్ ఆపరేషనల్ హెడ్ పద్మజను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. పలు సమస్యలపై శనివారం ఎంపీ ఆమెతో ఫోన్లో మాట్లాడారు. కొవిడ్‌కు ముందు ఎన్ని రైళ్లు రాకపోకలు సాగించాయి? తరువాత ఎన్ని రైళ్లు ప్రయాణాలు సాగిస్తున్నాయని ప్రశ్నించారు. రామచంద్రాపురం ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌ను పార్కింగ్ స్థలంగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. ఇక్రిశాట్ వైపు ప్రయాణికుల వాహనాలకు తగినంత పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని, తెల్లాపూర్ స్టేషన్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఎంపీ సూచనలకు పద్మజ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారంలోగా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బీరంగూడా బాలాజీ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన వస్తుందనే ప్రకటనలను నమ్మి మోసపోకూడదన్నారు. డిజిటల్ అరెస్ట్ చేశామంటే చూసి భయపడకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైతే సాధ్యమైనంత త్వరగా 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. యువత వ్యసనాల బారినపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని సూచించారు.

నేడు మల్లన్న లష్కర్‌వారం


కొమురవెల్లికి చేరిన సికింద్రాబాద్ భక్తులు ● ధూళిదర్శనం.. ఒడిబియ్యం సమర్పణ

చేర్యాల, జనవరి 25: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆల య బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు లష్కర్‌వారాన్ని నిర్వహించనున్నారు. సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా, రెండో ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు. సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం సాయంత్రానికి భారీగా భక్తులు ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుని దూళి, దర్శనం చేసుకున్నారు. నేడు ఎల్లమ్మతల్లికి బోనాలు నివేదించి, మల్లన్నకు పట్నాలు రచించి మొక్కులు తీర్చుకోనున్నారు.



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

మెదక్ అర్బన్/సంగారెడ్డి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు సంగారెడ్డి, మెదక్ జిల్లాలు ముస్తాబయ్యాయి. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెదక్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డిలో కలెక్టర్ క్రాంతి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. పరేడ్ మైదానంతోపాటు పరిసరాలను ముస్తాబు చేశారు. స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు జలాలు

పుల్‌కల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు సింగూరు ప్రాజెక్టు నుంచి రెండో విడతగా నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఘనపురం ఆయకట్టు కింద రైతులు వరి పంట సాగు చేస్తుండటంతో 0.35 టీఎంసీల జలాలను సింగూరు ప్రాజెక్టు నుంచి శనివారం విడుదల చేశారు. ప్రాజెక్టుకు ఎడమ వైపున ఉన్న జల విద్యుత్ కేంద్రంలోని రెండు టర్బైన్ల ద్వారా నీటిని విడుదల చేశారు. 2,842 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నాయి.

భూమి కబ్జా చేసి, దాడి చేశారు

పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
మాజీ మంత్రి నిమ్మ రాజారెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ నాయకుల ప్రోత్సాహం, అండదండలతో తన భూమిని కబ్జా చేసి, తన భార్యపై దాడి చేశారని మాజీ మంత్రి నిమ్మ రాజారెడ్డి తనయుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం, గాగిల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 8/1లో తనకు 7.31 ఎకరాల భూమి ఉన్నదని, అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్, మాజీ మంత్రి రెండో కుమారుడు సంజీవరెడ్డి తనయుడు చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డితో కుమ్మక్కై కబ్జా చేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి రాజారెడ్డి సంపాదించిన ఆస్తులకు సంబంధించి కుటుంబసభ్యులు క్రయవిక్రయాలు జరపకూడదని 2011 నవంబరులో కోర్టు ద్వారా మధ్యంతర ఉత్తర్వులు జారీఅయ్యాయని తెలిపారు. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను దిక్కరించిన మేక సంతోష్, నిమ్మ రాజీవ్‌రెడ్డి, చిలివేరు వెంకట్‌రెడ్డి భూమిని కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదేమిటని అడిగినందుకు తన భార్య నిమ్మ అనితపై దాడి చేశారని, దుర్భషలాడుతూ తన మొబైల్ ఫోన్‌ను పొలంలోకి విసిరివేశారని తెలిపారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, రెండు సెల్‌ఫోన్లు, కొంత డబ్బును దౌర్జన్యంగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. పోలీసుల దృష్టికి కబ్జా విషయాన్ని తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. దాడి విషయాన్ని, కోర్టు మధ్యంతర ఉత్తర్వుల పత్రాలతో సహా తన భార్య అనితతో కలిసి పోలీస్ అధికారులు, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ బేఖాతర్ చేస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి వాపోయారు.



భూమి పత్రాలను చూపుతున్న నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, ఆయన భార్య అనిత

అంగన్‌వాడీలో గడువు తీరిన సిరప్

15 నెలల పాపకు తాగించగా.. ఆందోళనలో తల్లిదండ్రులు

చిలప్‌చెడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో ఇచ్చిన సిరప్‌ను పాపకు తాగించిన తల్లిదండ్రులు.. అది గడువు తీరిందని తెలిసి ఆందోళన చెందుతున్న సంఘటన చిలప్‌చెడ్ మండలం పరిధిలోని జగ్గంపేటలో శనివారం చోటుచేసుకున్నది. పాప తండ్రి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ పాపకు 15 నెలల టీకా ఉండడంతో శనివారం అంగన్‌వాడీలో టీకా ఇప్పించగా, వారు జ్వరం సిరప్ ఇచ్చారు. దాన్ని చూడకుండా పాపకు తల్లి తాగించింది. తాను డ్యూటీ నుంచి వచ్చాక సిరప్ బాటిల్‌ను పరిశీలించగా సెప్టెంబర్ 2024లోనే గడువు ముగిసిందని తెలిసింది. ఎలా ఇచ్చారని ఆశా వర్కర్‌ను అడగగా, చూడకుండా ఇచ్చినట్లు బుకాయిస్తుందని తండ్రి నరేష్ తెలిపారు. వెంటనే పాపను సిరిపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా పాపను పరిశీలించిన వైద్యుడు ప్రస్తుతం బాగానే ఉందని, జాగ్రత్తగా చూసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది నిర్లక్ష్యంతో చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారు మండిపడ్డారు.



గడువు తీరిన సిరప్

దేశ, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన విద్యను నేర్పించాలి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కొణిదెల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కొణిదెల లక్ష్మీనారాయణ

జహీరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేశ, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన విద్యను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అందించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కొణిదెల లక్ష్మీనారాయణ అన్నారు. జహీరాబాద్ పట్టణ సమీపంలోని రావూస్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేయాలని, లక్ష్యాలను వారికే వదిలేయాలని, తల్లిదండ్రుల జోక్యం అంతగా అవసరం లేదన్నారు. వారి ఇష్టాలను వారికే వదిలేస్తే రంగం ఏదైనా అద్భుతంగ రాణిస్తారన్నారు. విద్యార్థుల్లో వారిలో దాగి ఉన్న సహజసిద్ధమైన ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. మారుతున్న కాలనుగుణంగా విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఊహించని ప్రశ్నలు అడిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పుస్తకాలను చదివితే జ్ఞానం వస్తుందని.. సమాజం, ప్రకృతిని, ఇతరుల జీవితాలను చదివితే విజ్ఞానం వస్తుందని, తనను తాను చదివితే దివ్య జ్ఞానం వస్తుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. తరగతి గదుల్లో ఉండే ప్రతీ విద్యార్థి మేధావియేనని, ఒక్కొక్కరికి ఒక్కోరకమైన అంశాలపై పట్టు ఉంటుందన్నారు. విద్యార్థులు మాతృభాషపై మరింత పట్టును పెంపొందించుకుంటూ ప్రపంచ భాషలను నేర్చుకుంటే ఎక్కడైనా రాణిస్తారనే విషయాన్ని గమనించాలన్నారు. విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న రావూస్ సంస్థ పనితీరును ఆయన అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రావూస్‌పాఠశాల నిర్వాహకులు నవీన్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, తల్లిదండ్రులు, ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం

జహీరాబాద్, జనవరి25 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త స్వామి, డీడీఎస్ మహిళా రైతులు చంద్రమ్మ, పూలమ్మ పేర్కొన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలితండాలో పాత పంటల జాతరను నిర్వహించారు. ఎడ్లబండ్ల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం చిరుధాన్యాల వంటకాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. రైతులు విధిగా చిరుధాన్యాల పంటలను సాగుచేసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వినయ్‌కుమార్, మంజుల, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర



ఖైదీల ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి భవానిచంద్ర

కంది, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు ఖైదీల కోసం న్యాయ సహాయ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె జైలులోని అన్ని బ్లాకులను, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాలలను పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహారంలో నాణ్యత లో లోపం ఉండకూడదని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పనితీరును ఖైదీలకు వివరించారు. సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.రమేష్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ దేవదాస్, జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి, జైలర్ మహిపాల్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు గౌతమ్, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో

సంగారెడ్డి ఉపాధ్యాయుడికి రెండో స్థానం



జ్ఞాపికను అందుకుంటున్న ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పుదుచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో సంగారెడ్డి జిల్లా నుంచి టీచర్ ఎగ్జిబిట్‌లో ర్యాలమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ రెండో స్థానంలో నిలిచారు. 'గణిత భావనలను సులభంగా అర్థం చేసుకోవడం' ప్రాజెక్టు ద్వారా 1 నుంచి 10వ తరగతి వరకు గణితానికి సంబంధించిన అంశాలను సులభంగా నేర్చుకోవడానికి తయారుచేసిన నమూనాలకు గుర్తింపు దక్కింది. 'లైఫ్ సేవర్ స్టిక్ ఫర్ ఫార్మర్స్' ఎగ్జిబిట్ రూపొందించిన పటాన్‌చెరు మండల ఇస్నాపూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి అంకిత్‌కుమార్, శాంసన్, గైడ్ టీచర్ భాస్కర్‌దేశ్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. వీరికి పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమ:శివాయ ప్రశంసాపత్రం, బహుమతి అందజేశారు. ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్, విద్యార్థులను కలెక్టర్ క్రాంతి, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి అభినందించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై

దాడి ఘటనలో 42మందిపై కేసు

పటాన్‌చెరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్యాంపు కార్యాయలంపై గురువారం దాడికి పాల్పడిన ఘటనలో 42 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నేత కాటశ్రీనివాస్‌గౌడ్ ప్రోద్బలంతో దాడి చేసి రూ.10వేల విలువైన ఫర్నీచర్ ధ్వంసం చేశారని క్యాంపు కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ కిష్టంగారి రాజు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భారత న్యాయ సంహిత సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ ఆక్ట్, 189(3), 190, 329(4), 324 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయకరెడ్డి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇంత పెద్ద ఎత్తున ఒకే సారి 42మంది ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

మరుగున మగ్గం

హన్మంత్‌రావుపేటతో తెగిన 'పోగు'బంధం





ఒకప్పుడు చక చక మంటూ చేనేత కుటుంబాలకు అదెరువైన మగ్గం నేడు ఆదరణ లేక మూలన పడి మూగబోయింది. నాడు నైపుణ్యమైన నేతకారులతో ప్రసిద్ధిగాంచిన ఆ ఊరు ఇప్పుడు వలసలతో వెలవెలబోతున్నది. ఉన్న కొంతమంది కూడా బీడీ కార్మికులుగా మారి బతుకు బండిని లాగుతున్నారు. గ్రామంలోని సగం కుటుంబాలు చేనతలవే కాగా, చాలామంది పొట్ట చేతబట్టుకుని ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లారు. దీంతో వారి ఇళ్లు శిథిలావస్థకు చేరి చేనేతల దుర్భర జీవన స్థితికి అద్దం పడుతున్నాయి.

-నారాయణఖేడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)

- నాడు నేతకారులతో గ్రామానికి గుర్తింపు
- నేడు ఆదరణ కరువై వలసబాట
- ఉన్న కొంతమంది ఇతర పనులకు..
- గ్రామంలో సగం కుటుంబాలు చేనేతలవే
- శిథిలావస్థకు చేరిన వలసదారుల ఇళ్లు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో కులవృత్తిపై ఆధారపడిన నేత కార్మికులు ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. నేత కార్మికులతో నాడు గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వచ్చినప్పటికీ, ప్రభుత్వ ఆదరణ లేక కార్మికులు వలస వెళ్లడంతో గ్రామంలోని కార్మికుల గృహాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఉన్న నేత కార్మికులు ఉపాధి కోసం దిక్కులు చూస్తున్నారు. కొందరు కులవృత్తిని వీడి ఇతర వృత్తులతో కొనసాగడమే కాకుండా, మరి కొందరు బీడీ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారు. గ్రామంలో పెద్దగా సాగు భూములు లేకపోయినప్పటికీ నేత కార్మికులు కుల వృత్తిని ఆసరాగా చేసుకొని, గతంలో చక్కటి నైపుణ్యంతో వస్త్రాలను నేసేవారు. నేత కారులను ప్రోత్సహించడం కోసం ఆ గ్రామానికి చెందిన గోసికే చంద్రయ్య చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ప్రభుత్వం ద్వారా ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడంతో సహకార సంఘం కూడా సక్రమంగా పని చేయడం లేదు. దీంతో నేత కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

బీడీలతో ఆదాయం అంతంతే



తమ కుల వృత్తిలో ఉపాధి లేక బీడీలు చుడుతున్న ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. దీనివల్ల తమ ఆరోగ్యంకూడా దెబ్బ తింటుంది. ఈ వృత్తి ద్వారా కూడా కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు.

- అంబటి ఈశ్వరమ్మ, బీడీ కార్మికురాలు



నేత కార్మికులు వలస వెళ్లడంతో శిథిలావస్థకు చేరిన కార్మికుల గృహం

చాలా కుటుంబాలు వలస..

హన్మంత్‌రావుపేటలో 2000 వరకు జనాభా ఉండగా, దాదాపు 1500 మంది వరకు ఓటర్లు ఉన్నారు. గ్రామ శివారులో కేవలం 337 ఎకరాల సాగు భూమి మాత్రమే ఉంది. గ్రామంలోని 449 కుటుంబాల్లో సగం చేనేతలవే ఉంటాయి. ప్రస్తుతం చేనేతకు ఆదరణ లేక ఉపాధి లేకపోవడంతో చాలావరకు కుటుంబాలు పొట్ట చేతబట్టుకుని ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లారు. వృత్తిపై ఆధారపడిన పలువురికి పెన్షన్‌లు కూడా అందడం లేదని నేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేత కార్మికుల కుటుంబాల్లో దాదాపు 100 మంది వరకు బీడీ కార్మికులు ఉన్నప్పటికీ ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులకు గిరాకీ తగ్గడంతో ఉపాధి కరువైందని వాపోతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నేత కార్మికులకు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలుపడంతో, తాము ఆనందంగా ఉన్నామని, ఈ ప్రభుత్వంలోనైనా తమకు ఆదరణ లభిస్తుందని వారు గంపెడాశతో ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..



ప్రస్తుత ప్రభుత్వంలోనైనా చేనేతల సమస్యలను పరిష్కరించాలి. తాము కులవృత్తిపై ఆధారపడడంతో ఇతర పనులు చేయలేక పోతున్నాం. దీంతో పూట గడవడమే కష్టంగా ఉన్నది. ప్రభుత్వం గమనించి చేనేతల కుటుంబాల ప్రోత్సహించి ఆదుకోవాలి.

- మాటూరి నారాయణ, నేత కార్మికుడు

నేత కార్మికుల భరోసా కల్పించాలి..



నేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. గతంలో గ్రామ నేత కార్మికులందరం చక్కటి నైపుణ్యంతో వస్త్రాలు నేసేవారం. ప్రోత్సాహం లేకపోవడంతో ఇప్పటికే అనేక మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రభుత్వం చేనేత కార్మికుల్లో భరోసా కల్పించి వలసలను అరికట్టాలి.

- అంబాదాస్, చేనేత సహకార సంఘం బాధ్యులు

ఇక.. ప్రత్యేక పాలన

(5వ పేజీ తరువాయి)

కనిపిస్తుంది. ఎన్నికలు పూర్తయ్యి కొత్త పాలకవర్గాలు కొలువు దీరాలంటే కనీసం ఏడాదైనా పట్టవచ్చని భావిస్తున్నారు.

జహీరాబాద్ ఎన్నికపై ఉత్కంఠ

సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ మున్సిపాలిటీకి గత 10 సంవత్సరాలుగా ఎన్నికలు జరగలేదు. హోతి.కె అనే గ్రామాన్ని పదేళ్ల క్రితం జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉంచాలని, మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ఎన్నిక నిర్వహించవద్దని హైకోర్టు నుండి ఉత్తర్వులు వచ్చాయి. అయితే మున్సిపాలిటీ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించగా ఈ కేసును కొట్టివేశారు. మళ్లీ గ్రామస్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అందుకే పదేళ్ల నుంచి ఇక్కడ ఎన్నికలు జరగలేదు. ఈ సమస్య కొలిక్కివచ్చి ఈసారైనా ఎన్నికలు జరుగాయా.. లేదా అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సిద్దిపేటకు 15నెలల గడువు

సిద్దిపేట మున్సిపాలిటీ పాలకవర్గానికి ఇంకా 15 నెలల గడువు ఉంది. ఇక్కడ 2021 మే నెలలో ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల ఎన్నికలకు సిద్దిపేట ఎన్నిక భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే పదేళ్ల క్రితం మున్సిపాలిటీలో పక్కనున్న గ్రామాల విలీనం వివాదంగా మారింది. గ్రామస్థులు కోర్టును ఆశ్రయించడంతో దాదాపు 6 సంవత్సరాల పైనే ఇక్కడ ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత వివాదం సద్దుమణగడంతో ఎన్నికలు జరిగాయి. 2026 మే 5వ తేదీతో సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం గడువు ముగుస్తుంది.

మానవతా దృక్పథంతో

బాధిత రైతుకు పట్టా



మహిళా రైతుకు సన్మానం చేస్తున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మానవతా దృక్పథంతో ఓ మహిళా రైతు తన పేరున ఉన్న కొంత భూమిని బాధిత రైతుకు పట్టా చేసింది. వివరాలకు వెళ్తే చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పోసగల్ల బాలమ్మకు 2014లో గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ కింద 1158 సర్వే నెంబర్ గల మూడెకరాల భూమిని పంపిణీ చేసింది. 2018లో తన భూమి నుంచి 8 గుంటలు భూమి అదే గ్రామానికి చెందిన యశోద పేరు మీద నమోదైంది. తిరిగి బాధిత రైతు పేర మార్చాలంటే ధరణి పోర్టల్ ద్వారా తప్పా మరో మార్గం లేదు. బాధిత రైతు గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. దీంతో వారందరూ యశోదతో మాట్లాడగా.. ఆమె న్యాయంగా ఆలోచించి బాధిత రైతుకు ధరణి పోర్టల్ స్లాట్ బుక్ చేసి పట్టా చేయించారు. యశోదను తహసీల్దార్ మన్నన్ శాలువాతో సన్మానించి అభినందించారు.

ఇంజనీర్స్ ట్రోఫీ విజేతగా మిషన్‌భగీరథ



మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: పని ఒత్తిడిలో నిత్యం విధులు నిర్వహించే ఉద్యోగులు స్నేహపూర్వక కలయికగా క్రికెట్ ట్రోఫీ ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని మిషన్‌భగీరథ, పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఆటవిడుపుగా సరదాగ గడిపారు. ఇరు శాఖల అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పోటీలో నిలిచారు. 12 ఓవర్ల మ్యాచ్‌లో ఒక్క పరుగు తేడాతో పంచాయతీ ఇంజనీర్ల బృందంపై మిషన్‌భగీరథ ఇంజనీర్ల బృందం విజయం సాధించింది. కార్యక్రమంలో మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్ డి.వెంకటేశ్వర్లు, ఎస్ఈ జగదీశ్వర్, ఈఈ నర్సింహులు, మిషన్‌భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం, ఇంట్రా ఈఈ సంపత్, డిప్యూటీ ఇంజనీర్లు పాండురంగారెడ్డి, విజయభాస్కర్, శ్రీనివాసులు, అమరేశ్వర్, పవన్ తదితరులు ఉన్నారు.

ఆమె వితంతువు.. అతడు వివాహితుడు

● పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

రామాయంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆమె వితంతువు, అతనూ వివాహితుడు. ఇద్దరిది ఒకే ఊరు వారిద్దరి పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసం చేశాడు. వివరాల్లోకి వెళ్లితే రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త మరణించడంతో కొన్నేళగా పుట్టింట్లోనే ఉంటుంది. ఇదే గ్రామానికి చెందిన గజం లింగమూర్తితో ఆమెకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇదే అదునుగా మాయ మాటలు చెప్పి లోబర్చుకోవడంతో పాటు 5 తులాల బంగారు నగలు, రూ. రెండు లక్షలు కాజేశాడు. తీరా పెళ్లికి నిరాకరించాడు. తీసుకున్న నగదు, నగలు కూడా ఇవ్వనని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో మోసపోయిన గ్రహించిన బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరుపెక్కిన సంగారెడ్డి



(5వ పేజీ తరువాయి)

సభలో నాయకులు మాట్లాడారు.

బీజేపీని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వొద్దు

ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రసంగిస్తూ తెలంగాణలో హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. భూమి కోసం భుక్తి కోసం ఆనాడు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో హిందూ, ముస్లిం, సిక్కులతో సహా అన్నివర్గాలవారు పాల్గొన్నారని గుర్తుచేశారు. కుల మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీని సకలశక్తులు ఏకమై తెలంగాణలో అడుగుపెట్టనివ్వవద్దని పిలుపునిచ్చారు. సమరశీల పోరాటలకు సీపీఎం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. బీజేపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా పరోక్షంగా సహకరిస్తుందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో దళితులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. ప్రజాసమస్యలపై పోరాడే సీపీఎం నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏ ఇతర హామీనీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండడంతో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పేరుతో తిరిగి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారుని చూస్తున్నామని.. రెండు పార్టీలు రూ. లక్షల కోట్లు దోచుకోవడంపై చూపిన శ్రద్ధ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చూపలేదన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారం కావాలంటే సీపీఎం పార్టీ బలబడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటి సభ్యుడు సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు మాణిక్యం, సాయిలు, అశోక్, దత్తు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

మద్యం తాగొద్దన్న భార్య..

భర్త ఆత్మహత్య

కుకునూరుపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఒడిశా రాష్ట్రానికి చెందిన బసంత్‌నాహాక్(30) భార్య భాగ్యతో కలిసి నాలుగు నెలల క్రితం మండలంలోని బొప్పాయిపల్లి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో పని కోసం వచ్చారు. నాహాక్ నిత్యం మద్యం తాగుతుండడంతో భార్య మానేయాలని చెప్పింది. శుక్రవారం కుకునూరుపల్లిలో సంతకు వెళ్లిన బసంత్ మళ్లీ మద్యం తాగి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు గుర్తు తెలియని మందు తాగాడు. గమనించిన భార్య గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరికి రెండు సంవత్సరాల బాలుడు ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

● సీపీ ఆఫీసు దగ్గర ఘటన..

ఆలస్యంగా వెలుగులోకి

సిద్దిపేట అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచనకోట గ్రామానికి చెందిన ఆది రాములు తన వ్యవసాయ భూమికి సంబంధించిన తగాదా విషయంలో గతంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సీపీ సమస్యను పరిష్కరించాలని చేర్యాల సీఐకి సూచించినా పరిష్కారం కాలేదు. దీంతో శుక్రవారం మరోసారి సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు రాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రాములు పురుగుల మందు తాగి వచ్చిన విషయాన్ని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాములు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమస్య పరిష్కారం కోసం పురుగుల మందు తాగి అధికారులను బెదిరించిన విషయంలో రాములుపై త్రీ టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. కాగా రాములుకు చెందిన విద్యుత్ స్టార్టర్, పైపులు ధ్వంసం చేసిన విషయంలో ఆది శ్రీనివాస్, మరి కొంత మందిపై చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ నీరేశ్ తెలిపారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి

నంగునూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు గ్రామానికి చెందిన కన్నారం జంపయ్య (45) శనివారం అక్కెనపల్లి మోయతుమ్మెద పెద్ద వాగులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజగోపాల్ పేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

న్యూస్ బాక్స్

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

చిలప్‌చెడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. శనివారం మండలం మండల పరిధిలోని అజ్జమర్రి, బండాపోతుగల్, ఫైజాబాద్, శిలాంపల్లి, గౌతాపూర్, చండూరు, చిట్కుల్ సోమక్కపేట, రాందాసుగూడ, రహీంగూతండా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారుల కుటుంబాలకు రూ.8,09,000 లక్షలను అందజేశారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

నారాయణఖేడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించే విధంగా చూడాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి శనివారం సేవాలాల్ సంఘం నాయకులు హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందించారు.

పిల్లల భద్రత తల్లిదండ్రుల బాధ్యత: డీఈవో

నిజాంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు భద్రంగా ఉండేవిధంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులది అని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

'విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి'

హవేళిఘణపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఎంఈవో మధుమోహన్ తెలిపారు. శనివారం మండలంలోని కూచన్‌పల్లి ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రవికుమార్ విద్యార్థులకు సూచనలు చేశారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

వెల్దుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య పర్యవేక్షణలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అపర్ణపాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్

నిరసనలు.. నిలదీతలు..

- దద్దరిల్లిన మున్సిపల్ సమావేశం
- డంపింగ్‌యార్డు వద్దంటూ కాంగ్రెస్ డిమాండ్

సదాశివపేట, జనవరి 25: (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిరసనలు... నిదీతలతో దద్దరిల్లిపోయింది. కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అపర్ణపాటిల్ అధ్యక్షతన చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంకాగానే కాంగ్రెస్ కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పట్నం సుభాష్ పెద్దఎత్తున నిరసన, ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్ ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుని, ఓ వెంచర్‌కు సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును కొత్తగా నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ భవన సముదాయం పక్కన సర్వే నెంబర్ 262లోకి తరలించేందుకు అధికారులను ఆదేశించారని ఆరోపించారు. ఆ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు కమిషనర్‌పై మండిపడ్డారు. అనంతరం కౌన్సిలర్ ఇలాయాజ్ షరీఫ్ మాట్లాడుతూ బల్దియాకు సొంత ఎక్స్‌కవేటర్ ఉన్నా అధికారులు ఉత్సవాలు, పండుగల ఏర్పాట్ల కోసం ప్రైవేటు ఎక్స్‌కవేటర్లను ఎంగేజ్ చేసుకుని రూ.లక్షల్లో బిల్లులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పట్టణంలో 500 వీధి కుక్కలను తరలించి వాటికి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేసినట్టు రూ.8 లక్షల బిల్లుపెట్టడం సిగ్గుచేటన్నారు. ఇవేకాకుండా పలు సమస్యలపై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు 24 వార్డుల కౌన్సిలర్లను, కో ఆప్షన్ సభ్యులను అధికారులు సన్మానించారు.

ఐదేళ్లలో అమీన్‌పూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాం

పటాన్‌చెరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లలో అమీన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దడంలో పాలకమండలి చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొనియాడారు. మున్సిపల్ పాలకవర్గం ముగిసినందున శనివారం ఏర్పాటు చేసిన చివరి వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు.

మున్సిపల్ పాలకమండలికి సన్మానం

ఐడిఏబొల్లారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ అభివృద్ధికి జీవిత కాలం పాటు గుర్తింపు తెచ్చే విధంగా నిధులు ఖర్చు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఐడిఏబొల్లారం మున్సిపల్ కార్యాలయంలో పాలకమండలి ముగింపు సమావేశం నిర్వహించారు. ఐదేళ్లకాలంలో సహకారం అందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

భావోద్వేగాలతో ముగిసిన బల్దియా సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులు, అధికారులతో కలిసి పనిచేసిన తీరును గుర్తు చేసుకుంటూ మెదక్ మున్సిపల్ పాలకవర్గం చివరి సమావేశాన్ని నిర్వహించారు. శనివారం చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమ అనుభవాలను తెలుపుతూ భావోద్వేగాలకు లోనయ్యారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. గడిచిన ఐదేళ్లలో పట్టణంలోని 32 వార్డుల్లో కోట్లాది రూపాయల పనులు చేపట్టామన్నారు. ప్రధాన రహదారి విస్తరణ ఈ పాలకవర్గానికి సంతృప్తినిచ్చిందని మున్సిపల్ చైర్మన్ అన్నారు. అనంతరం పాలకవర్గాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడతాం: ఎంపీ

కల్హేర్/నారాయణఖేడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మార్డి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామపంచాయితీ భవన నిర్మాణాలకు వారు శుక్రవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్ పాల్గొన్నారు. అలాగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖేడ్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమాల కోసం శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీవో అశోక చక్రవర్తితో కలిసి తహసీల్ మైదానాన్ని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ ఉన్నారు.


తహసీల్ మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోండి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'మన ఊరు-మన బడి' కింద నిర్మించిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉండడం, ఫ్యాన్లు ఫిటింగ్ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారా అంటూ ఆరాతీశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

కొండాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై కొండాపూర్ ఎంపీడీవో కార్యాలయం అవరణలో శనివారం సామాజిక తనిఖీ-ప్రజా దర్బార్ నిర్వహించారు. 2023-24 ఉపాధిహామీ పనులకుగాను 24 గ్రామపంచాయతీల్లో మొత్తం రూ.3.85 కోట్ల పనులు జరినట్లు తెలిపారు. గ్రామపంచాయతీల్లో నాటిన మొక్కలను సంరక్షించకపోవడం, పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మస్టర్లపై కూలీల పేర్లకు బదులు కుటుంబసభ్యుల హాజరు, కూలి చెల్లింపుల రసీదుల ఇచ్చే వంటి పనులపై తప్పిదాలను తనిఖీల్లో గుర్తించారు. తప్పిదాలకు పాల్పడిన ఎఫ్ఏలకు రూ.30,950 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. వచ్చే సామాజిక తనిఖీల్లో చిన్న తప్పిదం జరగకుండా చూడాలని అదనపు పీడీ బాలరాజ్, డీఆర్‌వో నాగేశ్వర్‌రావు సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో పరిశీలకులు మణికుమార్, ఎస్ఆర్‌పీ కవిత, అసిస్టెంట్ పీడీ పూజ, శ్రీలత, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో వీరప్ప, టీఏలు, ఈసీలు పాల్గొన్నారు.

మార్కెట్ ఎత్తేయాలని చర్చి నిర్వాహకుల హుకుం

- మున్సిపల్ భవన నిర్మాణానికి చదును చేసి డేరాల ఏర్పాటు
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

మెదక్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'కూరగాయల మార్కెట్‌కు స్థలమేదీ..!' అంటూ ఈనెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం నిజమైంది. రామాయంపేటలో ప్రస్తుతం నడుస్తున్న చర్చి స్థలం నుంచి మార్కెట్ తొలగించాలంటూ హెచ్చరికలు వచ్చాయి. దిక్కుతోచక ఎట్టకేలకు అక్కడి నుంచి వ్యాపారాలు మార్చేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం మున్సిపల్ కొత్త భవన నిర్మాణానికై చదును చేసిన అత్యంత విలువైన స్థలానికి విక్రయదారులు శనివారం చేరుకున్నారు. డేరాలు వేసుకొని ఆదివారం నుంచి అమ్మకాలు సాగించే ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచీ తొలగిస్తే ఉద్యమిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ఓవైపు మున్సిపల్ తైబజార్ వసూలు చేస్తున్నా.. ఇన్నేళ్లుగా పర్మినెంట్ మార్కెట్ కేటాయించలేదని మండిపడుతున్నారు.


విలువైన స్థలంలో డేరాలు వేస్తున్న వ్యాపారులు

ఓటు హక్కు దినోత్సవం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని పలువురు పేర్కొన్నారు. శనివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

- న్యూస్ నెట్‌వర్క్


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ క్రాంతి


మెదక్ జిల్లా కేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, విద్యార్థులు

మున్సిపల్ సమావేశంలో బాహాబాహీ

- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట

సంగారెడ్డి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి గ్రేడ్ వన్ మునిసిపల్ బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల కౌన్సిలర్ల మధ్య పరస్పరం ఆరోపణలతో బాహాబాహికి దిగారు. శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం జరిగింది. ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించాల్సిన బడ్జెట్ సమావేశాన్ని ముందస్తుగా నిర్వహించడంలో పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. స్పందించిన కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ మాట్లాడుతూ రేపటి (ఈ నెల 27)తో పాలకవర్గం పదవీ కాలం ముగుస్తుండడంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అనుమతితో బడ్జెట్‌ను తయారు చేశామన్నారు. పట్టణంలో మునిసిల్ అభివృద్ధి పనులతో పాటు మునిసిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు, పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సమస్య, విద్యుత్ బిల్లులు, రుణ వాయిదాలు చెల్లింపులు, హరితహారం తదితర పనులకు 2025-26 సంవత్సరానికి కలిపి మొత్తం రూ.31.87 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. కౌన్సిలర్లు ఆమోదించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పథకాల అమలు కోసం ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కమిటీల్లో అవకతవకలు జరిగాయంటూ బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. ఈ కమిటీల్లో అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లను సభ్యులుగా చేర్చుతున్నట్లు చెప్పిన అధికారులు రాత్రికిరాత్రి తమ పేర్లను ఎందుకు తొలగించారని కౌన్సిలర్లు విష్ణు, మందుల నాగరాజు, రమేశ్, ఆరీఫ్, జీవీ వీణలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారంటూ పలువురు కౌన్సిలర్లు ఆరోపించడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు కలుగజేసుకుని గొడవకు దిగారు. చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ కౌన్సిలర్లను సముదాయించారు. మహబూబ్‌సాగర్‌లో గుర్రపుడెక్క తొలగింపునకు మత్స్య సహకార సంఘం నుంచి రూ.16 లక్షలు ఖర్చుచేయగా, మునిసిపల్ నుంచి మరో రూ.12 లక్షలు ఖర్చు చేస్తున్నట్లుగా లెక్కల్లో చూపడం ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న మునిసిపల్‌కు చెందిన మటన్ దుకాణాలపై ప్రైవేట్ వ్యక్తుల ఆజామాయిషీ కొనసాగుతుందని, తద్వారా మునిసిపల్ ఆదాయానికి గండిపడుతుందన్నారు.


పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు

జాతీయ పతాకానికి అవమానం

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మునిసిపల్ అధికారులు కౌన్సిలర్లకు పంపిన ఆహ్వాన పత్రంలో జాతీయజెండా తలకిందులా ముద్రించి జెండాను అవమాన పర్చారని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన కమిషనర్ ఆహ్వాన పత్రంలో చోటుచేసుకున్న తప్పును సరిచేసి తిరిగి ముద్రించారు. డీఈఈ ఇంతియాజ్ అహ్మద్, టీపీవో కరుణాకర్, మేనేజర్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలి: కలెక్టర్

సంగారెడ్డి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను 26న అట్టహాసంగా ప్రారంభించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి శనివారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సంక్షేమ పథకాల అమలుచేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించినా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేసి.. ఇప్పుడు అదడే నాయకులు ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. శనివారం నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా పథకాలు అమలుచేస్తూ ప్రజాదరణ పొందుతుంటే.. ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

షానుభాయికి ఉమెన్ లెజెండ్ అవార్డు


షానుభాయికి ఉమెన్ లెజెండ్ అవార్డును అందజేస్తున్న ట్రస్టు ప్రముఖులు

జహీరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసుగా విధులను నిర్వహిస్తున్న షానుభాయికి శనివారం హైదరాబాద్‌లో కొమ్మూరీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ప్రముఖులు సావిత్రిబాయిపూలే ఉమెన్ లెజెండ్ అవార్డు-25ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె షానుబాయి మాట్లాడుతూ తనకు పోలీస్‌శాఖలో ఉన్నతాధికారులు సహకరించడం మూలంగానే అవార్డు వచ్చిందని చెప్పారు. కొమ్మూరీ చారిటబుల్ ట్రస్టు అధినేత డా.రామకృష్ణాగౌడ్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ వైస్ చైర్మన్ బక్కి క్రిష్ణ, కళారత్న అవార్డు గ్రహీత కొమ్మూరీ శ్రీనివాస్ నుంచి షానుబాయి అవార్డు అందుకున్నది.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కల్హేర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామ పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎండీ.గౌస్‌ను సస్పెండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా డీఆర్డీవో జ్యోతి ఉత్తర్వులు జారీచేశారు. ఈజీఎస్ పనులకు సంబంధించిన పనులు సకాలంలో చేపట్టకపోవంతో పాటు నకిలీ కూలీల జాబితాలు(మస్టర్ రోల్స్) సృష్టించి కూలీల జాబ్‌కార్డు నంబర్లను ఉపయోగించి కూలీ డబ్బులు దండుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి తోడు కూలీలను, మహిళలను అసభ్యకర పదజాలంతో దూషించాడు. వారి ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేసి గౌస్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'గుంతల రహదారిని బాగుచేయండి'

జిన్నారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా మారిన జిన్నారం-అన్నారం ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు. ఇటీవలే ఈ రోడ్డుకు మరమ్మతు చేసినా, ఇటుక బట్టీల కోసం మట్టిని తరలించే భారీ వాహనాలతో రోడ్డంతా గుంతలమయంగా మారి, ప్రమాదాలు కల్గిస్తున్నాయని, వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

62 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

నారాయణఖేడ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఖేడ్ ప్రాంతానికి చెందిన 62 మందికి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో 23న ఖేడ్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 127 మందికి పరీక్షలు నిర్వహించగా, 72 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శంకర ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి శనివారం వారిని ఖేడ్‌కు తీసుకువచ్చారు. మిగిలిన 10 మందిని 27 తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు సత్యసాయి సేవల సంస్థ జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నారాయణఖేడ్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభకు 2025-2026 సంవత్సరానికిగాను అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంత్‌కిషన్, జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్‌ప్రభు, జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్‌గుప్తా శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మారు సంగారెడ్డి డివిజన్‌కు చెందిన వారు మాత్రమే అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు అర్హులని, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో సభ్యత్వం ఉండి, ఇప్పటికే మండల, జిల్లా, మహాసభలో అధ్యక్షులుగా లేదా కార్యవర్గంలో పనిచేసిన వారు అర్హులు అన్నారు. పోటీచేసే వారు రీఫండ్ కాని విధంగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 9న సంగారెడ్డిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 10 నుంచి నామినేషన్ పత్రాలు పొంది, 1 గంట వరకు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

పక్షంరోజుల్లో రోడ్డు పనులు చేస్తాం

నిజాంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పక్షంరోజుల్లోగా రోడ్డు పనులను ప్రారంభిస్తామన్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్ హామీతో గ్రామస్థులు నిరసన దీక్షలు విరమించారు. 17 రోజులుగా నస్కల్ రోడ్డు పనులు ప్రారంభించాలని దీక్షలు చేపట్టగా.. ఎట్టకేలకు పాలకవర్గం, అధికారులు స్పందించి హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, లింగంగౌడ్, వెంకటేష్‌గౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

114 రకాల వంటలతో ప్రదర్శన

జహీరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం వంటల తయారీ, మెహందీలకు సంబంధించిన పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు సుమారు 114 రకాల వంటను తయారు చేసి తీసుకొచ్చి ప్రదర్శించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి 26న బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ చింతల హరికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్యారం పోటీలకు ఎంపీవో

తూప్రాన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని పూణేలో ఫిబ్రవరి 17 నుంచి 22 వరకు జరిగే జాతీయస్థాయి క్యారం పోటీలు జరగనున్నాయి. ఈనెల 23, 24 తేదీల్లో ఎల్బీ స్టేడియంలో రాష్ట్రస్థాయి క్యారం పోటీలు నిర్వహించారు. ఇందులో తూప్రాన్ ఎంపీవో ఎస్.సతీష్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్యారం పోటీలకు ఎంపికయ్యారు.

చెరువులో పడి యువకుడి మృతి

మెదక్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి సనిధి అగ్రహారం గ్రామానికి చెందిన కంతి శంకర్(35) ఉదయం కాలకృత్యాలకు వెళ్లి.. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.